## అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న టీఏజీఎస్ నాయకులు, కూలీలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18 : తునికాకు కొనుగోలు యూనిట్లను యథావిధిగా కొనసాగించాలని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి సచిన్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న తునికా బోనస్‌ను కూలీలకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బోనస్ చెల్లించగా.. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెల్లింపులు జరగలేదని వారు ఆరోపించారు.

## ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్


రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

తాంసి, మార్చి 18 : గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ స్వప్నను సస్పెండ్ చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. సోమవారం ఆ పాఠశాలను పీవో ఆకస్మిక తనిఖీ చేయగా, ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన కామాటి మహేందర్, వాచ్‌మన్ విజయ్ అందుబాటులో లేరు. పదోతరగతి గదిలో సదుపాయాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి ప్రారంభమైనా ఫ్యాన్లు తిరగకపోవడంతో అధికారిపై మండిపడ్డారు. వార్డెన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించి మహేందర్, విజయ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉపాధ్యాయులు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కార్పొరేట్ వేట..

### టెన్త్ విద్యార్థుల కోసం ప్రైవేటు కళాశాలల అన్వేషణ

- జేఈఈ, నీట్‌లలో ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఎర
- పీఆర్వోలను నియమించుకున్న సంస్థలు
- తల్లిదండ్రులను మభ్యపెట్టి అడ్మిషన్లు
- ఎంపీసీ, బైపీసీ కోర్సులకు రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల ఫీజు
- విద్యాశాఖ ఆదేశాలు బుట్టదాఖలు
- చోద్యం చూస్తున్న అధికారులు




నిర్మల్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పదో తరగతి విద్యార్థుల కోసం కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వేట మొదలుపెట్టాయి. ఇందుకోసం తాము ప్రత్యేకంగా నియమించుకున్న పీఆర్వోలను రంగంలోకి దింపాయి. మరోవైపు పాఠశాలల యాజమాన్యాలకు భారీగా ముడుపులు ముట్టజెప్పి, వారి పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి తమ కళాశాలల్లో చదువు బాగుంటుందని, ఇక్కడ చదివిన వారు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో హైదరాబాద్‌కు చెందిన పలు కార్పొరేట్ కళాశాలల పీఆర్వోల సందడి కనిపిస్తున్నది. పదో తరగతి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలుస్తున్నారు. రంగు రంగుల బ్రోచర్లను అందజేస్తున్నారు. ముఖ్యంగా ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే ఇంజినీరింగ్‌లో జేఈఈ, ఐఐటీ, ఎంసెట్, నీట్‌తో పాటు ఐఏఎస్, ఐపీఎస్‌లకు శిక్షణనిస్తామని చెబుతున్నారు. విద్యార్థుల మేధస్సును బట్టి సూపర్-60, సూపర్-90 మొదలగు పేర్లతో బ్యాచ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తామని పేరెంట్స్‌ను మభ్య పెడుతున్నారు. ఇందుకోసం ఎంపిక చేసుకున్న కోర్సును బట్టి రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఫీజులు ఉంటాయని చెబుతున్నారు. వెంటనే సీటు బుక్ చేసుకుంటే ఫీజులో కొంత రాయితీ లభిస్తుందని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు.

**రూ.10 వేలు అడ్వాన్స్..**

సీటు బుక్ చేసుకోవాలంటే ముందుగా రూ.10 వేలు అడ్వాన్స్‌గా చెల్లించాలని ఒత్తిడి తీసుకొస్తున్నాయి. ఆలస్యమైతే సీటు దొరకదేమోనన్న ఆతృతతో పీఆర్వోలు అడిగిన వెంటనే తల్లిదండ్రులు కూడా డబ్బులు చెల్లిస్తున్నారు. అడ్వాన్స్ చెల్లిస్తేనే ఫీజులో రాయితీ లభిస్తుందని కొందరు పీఆర్వోలు చెబుతున్నారు. ఏసీ క్యాంపస్ అయితే అదనంగా మరో రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. పీఆర్వోల తీరుతో విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు.

**ఆదేశాలు బుట్టదాఖలు...**

అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులపై ఎవరూ ఒత్తిడి తేవద్దని ఉన్నత విద్యాశాఖ అధికారులు గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. అయినా వాటిని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. అడ్మిషన్ల కోసం ఎన్నికల ప్రచారానికి మించి తిరుగుతున్నారు. ఏటా మార్చి, ఏప్రిల్ మాసాల్లో పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులకు కార్పొరేట్ విద్యా సంస్థలు తమ పీఆర్వోల ద్వారా నజరానాలు ఇస్తుంటాయి. ఒక్కో పాఠశాలకు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు నజరానాలు ఇచ్చి విద్యార్థుల వివరాలను సేకరిస్తారు. వాటి ఆధారంగానే తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి పిల్లలను తమ కళాశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ 'వల'కు చిక్కకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# ఎన్నికలపై నజర్



**ప్రత్యేక దృష్టి సారించిన అధికార యంత్రాంగం**

- బ్యాంకు లావాదేవీలు, ఆన్‌లైన్ చెల్లింపులపై నిఘా
- ప్రచార ఖర్చులు, కోడ్ ఉల్లంఘనపై ప్రత్యేక బృందాలు
- జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు
- సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్ ఏర్పాటు
- నిరంతరం తనిఖీలు చేసేందుకు ప్రత్యేక బృందాలు

నిర్మల్ టౌన్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) ప్రకటించిన నేపథ్యంలో నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. మే 13వ తేదీన ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎన్నిక జరగనుండగా.. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లను తొలగిస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలతోపాటు ఆదిలాబాద్, బోథ్, కుమ్రం భీం ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్ నగర్ సెగ్మెంట్లు ఉన్నాయి.

**922 కేంద్రాలు..**

**7,34,826 మంది ఓటర్లు..**

నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 7,34,826 మంది ఓటర్లు ఉండగా.. 922 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖానాపూర్‌లో 2,23,783.. ముథోల్‌లో 2,53,797.. నిర్మల్‌లో 2,57,248 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 85 ఏండ్లు పైబడిన వారు 4,011 మంది ఓటర్లు ఉన్నారు. 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు కావడానికి సీఈసీ మరో అవకాశాన్ని కల్పించింది. బీఎల్‌వో కేంద్రాలు, ఫామ్ నంబర్ 6 ద్వారా ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఓటరు నమోదుకు స్వీప్ ద్వారా అవగాహన కల్పిస్తుండగా.. ఇందుకోసం నోడల్ అధికారిని నియమించారు. దివ్యాంగులు, మహిళలకు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాలను కలించేలా అధికారులు చర్యలు ప్రారంభించారు.

**బ్యాంకు లావాదేవీలు,**

**ఆన్‌లైన్ చెల్లింపులపై నిఘా..**

ఓటింగ్ శాతాన్ని 75 నుంచి 85 శాతానికి పెంచేందుకు ఓటరు చైతన్య కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన వెబ్‌కాస్టింగ్, రూట్, సెక్టోరియల్, పోలింగ్, ఇతర సిబ్బందిని సిద్ధం చేశారు. ఈవీఎం, ఈవీఎం ప్యాడ్స్‌ను తనిఖీ చేసి గోదాములో నిల్వ ఉంచారు. ప్రచారం ఖర్చులు, కోడ్ ఉల్లంఘనపై ప్రత్యేక బృందాలను నియమించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మద్యం, నగదుపై నిఘా పెంచారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈసారి బ్యాంకు లావాదేవీలు, ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రత్యేక నిఘా ఉంచారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రూ.50 వేల కంటే ఎక్కువగా చెల్లింపులు జరిగితే బ్యాంకు సిబ్బంది విజిలెన్స్ టీంకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే గ్రామాలు, మున్సిపాలిటీల్లో కోడ్ అమలు లోని రావడంతో అధికారులు రంగంలోనికి దిగారు. పోలింగ్ కేంద్రానికి దగ్గరలో ఉన్న గోడరాతలు, ప్రచార పోస్టర్లను తొలగిస్తున్నారు. ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్ బృందాలు నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన 100 నిమిషాల్లోనే అక్కడికి చేరుకోవాలని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# జీరో బారులు

### ఉచిత కరెంటు బిల్లు రాదు.. గ్యాస్ బండ డబ్బులు పడవు..

- తప్పుడు వివరాల నమోదుతో ప్రజలకు తంటాలు
- ప్రజా పాలన సేవా కేంద్రాల వద్ద క్యూ


ఆదిలాబాద్ మున్సిపాలిటీలో జీరో కరెంటు బిల్లు, రూ.500ల సిలిండర్ కోసం వివరాలు అందజేసేందుకు వచ్చిన దరఖాస్తుదారులు

ఆదిలాబాద్, మార్చి 18(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఆర్భాటంగా అమలు చేస్తున్నామని చెబుతున్న ఆరు గ్యారెంటీలపై గందరగోళం నెలకున్నది. ప్రభుత్వం సూచించిన అన్ని వివరాలతో తాము ప్రజాపాలనలో పలు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా.. రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నదని అర్హులు ఆవేదన చెందుతున్నారు. డిసెంబరు 28 నుంచి ప్రారంభమైన ప్రజాపాలనలో ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకు గ్యాస్ సిలిండర్ పథకాలకు మున్సిపాలిటీ పరిధిలోని 48,865 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం సూచించిన రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కరెంటు మీటరు నంబరు, గ్యాస్ కనెక్షన్, ఫోన్ నంబర్ వివరాలను దరఖాస్తుతో జతపర్చారు. తమకు ఉచిత కరెంటు, రూ.500ల గ్యాస్ సిలిండర్ వస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. 50 శాతానికి పైగా దరఖాస్తుదారులకు జీరో బిల్లులు రాకపోగా, సిలిండర్ డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా ఉన్న తమకు జీరో కరెంటు బిల్లు, రూ.500 గ్యాస్ సిలిండర్ ఎందుకు రావడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వివరాల నమోదులో తప్పులు**

ప్రజాపాలన దరఖాస్తుల్లోని వివరాలను ఆన్‌లైన్ తప్పుగా నమోదు చేయడం ప్రజలకు శాపంగా మారింది. సమయం తక్కువగా ఉండడంతో ప్రైవేటు కళాశాలలు, ఇతర కేంద్రాల్లో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమో దు చేశారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సిబ్బంది దరఖాస్తుదారుల వివరాలను సరిగా నమోదు చేయలేదు. అర్హులైన వారు ఆరు గ్యారెంటీలకు దూరమయ్యారు. పథకాలు రానివారు తిరిగి తమ వివరాలను మళ్లీ సమర్పించేలా ప్రభుత్వం మున్సిపాలిటీలో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల వద్ద జనం వారం రోజులుగా బారులుదీరుతున్నారు. దరఖాస్తుదారులు తమకు ఎందుకు జీరో కరెంటు బిల్లు, గ్యాస్ సిలిండర్ డబ్బులు పడలేదని అధికారులను సంప్రదిస్తే నాట్ అప్లయిడ్, నాట్ మ్యాచ్డ్, డాటా నాట్ ఫౌండ్ అని ఆన్‌లైన్‌లో చూపిస్తున్నదని తెలుపుతున్నారు. అధికారులు ఏమి చేయలేని పరిస్థితి నెలకున్నది. ఇలా కనబడిన దరఖాస్తుదారుల విషయంలో తాము ఏమి చేయలేమని, ఎడిట్ ఆప్షన్ లేనందువల్ల ఈ పరిస్థితి ఉందని మున్సిపల్ అధికారులు అంటున్నారు. దీంతో జనం ఆందోళన చెందుతున్నారు.

**ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు..**



ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోవడంతో జనం ఆందోళన చెందుతున్నారు. సగం మందికి జీరో బిల్లులు రాక, సిలిండర్ డబ్బులు జమకాక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే డాటా నాట్ ఫౌండ్, నాట్ అప్లయిడ్, డాటా నాట్ మ్యాచ్డ్ అని సూచిస్తున్నది. ఇలాంటి దరఖాస్తుల విషయంలో ఏమి చేయాలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. అర్హులైన వారందరికీ గ్యారెంటీ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలి.

**- బండారి సతీశ్, కౌన్సిలర్, ఆదిలాబాద్ మున్సిపాలిటీ**

**జీరో బిల్లు రాలేదు..**



ప్రజాపాలనలో నేను 200 యూనిట్ల ఉచిత కరెంటు కోసం దరఖాస్తు చేసుకున్నా. కానీ.. నాకు జీరో బిల్లు రాలేదు. కరెంటు సిబ్బంది వచ్చి రూ.800 బిల్లు ఇచ్చారు. జీరో బిల్లు ఎందుకు రాలేదని అడిగితే.. మాకు తెలియదు, మున్సిపాలిటీకి వెళ్లి అడగమన్నారు. ప్రజాపాలన రశీదు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తీసుకుని మున్సిపాలిటీకి వచ్చా. ఇక్కడ పెద్ద లైన్ ఉంది. ఇప్పుడైనా జీరోబిల్లు వస్తుందో రాదో తెలియదు.

**- గుణాజీ, 27 వార్డు, ఆదిలాబాద్.**

# పది పరీక్షలు ప్రారంభం

### కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


నిర్మల్ అర్బన్ : పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, మార్చి 18 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు రావడంతో పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. హాల్‌టికెట్‌ల ఆధారంగా విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు.

**కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్..**

రాంనగర్ కాలనీలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, సదుపాయాలను పరిశీలించారు. భద్రతా సిబ్బంది ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాతనే లోనికి అనుమతించాలని సూచించారు. సెల్‌ఫోన్, వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ జిల్లాలో..**

ఆదిలాబాద్ రూరల్, మార్చి 18 : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 53 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి పరీక్షకు 10,402 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 10,367 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరయ్యారు. డీఈవో ప్రణీత, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు కేంద్రాలను సందర్శించారు.

**పది విద్యార్థులకు ఉచిత వాహనం..**

లోకేశ్వరం, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడానికి అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ వాహనంలో ఉదయం 8 గంటల నుంచి లోకేశ్వరం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటుందని ఆ సంస్థ చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. 99122 67973 ఫోన్ చేసి వినియోగించుకోవాలని కోరాడు.


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

## స్క్రైబ్ పద్ధతిలో పరీక్ష రాసిన విద్యార్థులు


తనకు బదులుగా పరీక్ష రాసేందుకు 9వ తరగతి విద్యార్థిని మానసను వెంట తెచ్చుకున్న పల్లవి

దస్తురాబాద్, మార్చి 18 : ఆదిలాబాద్ జిల్లా దస్తురాబాద్ మండలంలో ఇద్దరు విద్యార్థులు స్క్రైబ్ పద్ధతిలో సోమవారం పదో తరగతి పరీక్ష రాశారు. మున్యాల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నరపాక పల్లవికి 90 శాతం అంగవైకల్యం ఉంది. చేతులు పనిచేయకపోవడంతో నెమ్మదిగా రాస్తున్నది. ఈమెకు అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జక్కుల మానస పరీక్ష రాసింది. అదేవిధంగా అంబారిపేట పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నారి లక్ష్మణ్‌కు నరాల బలహీనతతో చేతులు పనిచేయవు. దీంతో అదే బడిలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి వెంకట శ్రవణ్ పరీక్ష రాశాడు.ర

## వడగళ్ల వర్షం.. అపార నష్టం

తాంసి(తలమడుగు), మార్చి 18 : భరంపూర్, పల్లి(కే), పల్లి(బీ) గ్రామాల్లో సోమవారం వడగళ్ల వర్షం కురిసింది. మక్క పంట నెలకొరిగింది. బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్ రెడ్డి నాయకులతో కలిసి దెబ్బతిన్న మక్క చేలను పరిశీలించారు. సుమారు 300 ఎకరాల మక్క, 200 ఎకరాల జొన్న, కొంత మేర పొగాకు పంటకు నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట నాయకులు రంజిత్ రెడ్డి, రమాకాంత్, నష్టపోయిన రైతులు ఎల్టీ భోజారెడ్డి, రవీందర్ రెడ్డి, మాదురి మల్లేశ్, గ్రామస్తులు ఉన్నారు.

## నిర్మల్ వైద్య కళాశాల హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్

**మినిమల్ ఆక్సెస్ పద్ధతి ద్వారా ఆపరేషన్ చేసిన వైద్యుడు**

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 18 : నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో వైద్యులు కార్పొరేటుకు దీటుగా అరుదైన ఆపరేషన్ చేశారు. మహిళ కాలేయంలో నుంచి రెండు లీటర్ల చీము గడ్డ తొలిగించి, మహిళ ప్రాణాలు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన గాయి పద్మ తీవ్రమైన జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ.. ఫిబ్రవరి 28న నిర్మల్ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేరింది. మహిళకు పరీక్షలు చేసిన వైద్యులు.. కాలేయంలో చీము గడ్డలు ఉన్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితి విషమంగా ఉండడంతో మార్చి 1వ తేదీన సర్జికల్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ రాకేశ్ మహిళకు మినిమల్ ఆక్సెస్(కోత లేకుండా) శస్త్ర చికిత్స చేశారు. కాలేయం నుంచి 2 లీటర్లకు పైగా చీము తొలిగించారు. ఆమె పూర్తిగా కోలుకోవడంతో సోమవారం డిశ్చార్జి చేశారు.


మహిళను డిశ్చార్జి చేస్తున్న సూపరింటెండెంట్ సునీల్, వైద్యుడు రాకేశ్

## వైభవంగా నిశ్చితార్థ మహోత్సవం

ఇంద్రవెల్లి, మార్చి 18 : అంజీ గ్రామంలోని పూలాజీ బాబా ధ్యానకేంద్రం ఆవరణలో సోమవారం ఆంద్ ఆదివాసీ సమాజ్‌తోపాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో సామూహిక నిశ్చితార్థ మహోత్సం వైభవంగా కొనసాగింది. ఆరు జంటలను ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆశీర్వదించారు. మాజీ ఎంపీపీ కనక తుకారాం, ఆంద్ ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు, ఆంద్ ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాందాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి పాల్గొన్నారు.


పూలాజీ బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జంటలు